క్లుప్తంగా

నూరిఫాతిమాకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నేతలు



పట్నంబజారు: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా, మాజీ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫాకు పార్టీ నేతలు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. మంగళదాస్ నగర్‌లోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందజేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు.

మానవ జీవితానికి దారి దీపాలు గ్రంథాలయాలు

నగరంపాలెం: గ్రంథాలయాలు మానవ జీవితానికి దారి దీపాలు అని అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కోసూరి రవి కుమార్ అన్నారు. సీనియర్ సిటిజన్ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పునర్వికాస ఉద్యమ కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ గ్రంథాలయాలు పునర్వికాసం పొందాలని అన్నారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులను కొంతమేర గ్రంథాలయాలకు కేటాయించాలని చెప్పారు. గ్రామ, గ్రామాల్లో గ్రంథాయల ఉద్యమం కోసం సామాజిక చైతన్య కార్యక్రమాలు రూపొందించాలని అన్నారు. కళా రూపాలల్లో కూడా ప్రజల వద్దకు వెళ్లాలని అన్నారు. వక్తలుగా ఆచార్యులు సీహెచ్ సుశీలమ్మ, షేక్ బాబుజీ, అరసం సభ్యులు, సాహిత్యాభిమానులు, గ్రంథాలయ ఉద్యమ అభిమానులు పాల్గొనగా, కేంద్ర సాహిత్య అవార్డుగ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, శరశ్చంద్ర, దివి కుమార్ పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిష్పక్షపాత విచారణ జరపాలి



నెహ్రూ నగర్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరపాలని సామాజికవేత్త డాక్టర్ గోళ్లమూడి రాజా సుందర బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు గుంటూరు నగరంలోని వివిధ సంఘాల పాస్టర్లు, ప్రజా సంఘాల నాయకులు ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రాన్ని అందించేందుకు ప్రత్యేక కార్యచరణ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి నగరంలోని అన్ని సంఘాల పాస్టర్లు విశ్వాసులు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మావేశంలో దళిత క్రిస్టియన్ వాచ్ నాయకులు గద్దె రత్నశ్రీ, ఏఈఎల్సీ నాయకులు జె.రవికాంత్, క్రైస్తవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మద్దు ప్రేమ జ్యోతి బాబు, భీమ్ సేన్ సేవాదళ్ అధ్యక్షులు నల్లపు నీలాంబరం, సుద్ద దేవరాజు, జయరత్నం, కార్యశెట్టి గోపి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అవగాహన సంస్థ ఉగాది కవితా గోష్ఠి



లక్ష్మీపురం: కవి సమ్మేళనాలకి, ఉగాది పండుగకి అవినాభావ సంబంధం ఉందని విద్యావేత్త శాంతా శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని సోమవారం కవితా గోష్ఠి నిర్వహించారు. పలువురు కవులు మినీ కవితలు వినిపించారు. అనంతరం కవయిత్రులు ఎ.సుభద్ర, పింగళి భాగ్యలక్ష్మి, కవి బండి జమదగ్నిలను అవగాహన సంస్థ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో కవులు ధనుంజయ రెడ్డి, వీవీ రావ్, శేష ఫణి శర్మ, గిరి భూషణరావు, ఆర్.వి సింగరయ్య, కవయిత్రులు పింగళి భాగ్యలక్ష్మి, సుభద్ర, హైమ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత రాణారాయల్



ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బేతపూడి ప్రీమియర్ లీగ్ సీజన్–4 క్రికెటు పోటీలు సోమ వారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 8 టీంలు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో యాంగ్రీ టైగర్స్ టీం పది ఓవర్లలో 63 పరుగులకు ఆల్ అవుట్ అయ్యింది. రాణా రాయల్ ఫైటర్స్ టీం ఏడు ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. బెస్ట్ బ్యాట్‌మెన్‌గా ఖాజబంద, బెస్ట్ బౌలర్‌గా మదార్ వలి నిలిచారు. విజేతకు రూ.10 వేల నగదు, షీల్డ్‌ను లైఫ్‌కేర్ డయాగ్నస్టిక్ అధినేత షేక్ వలీ, ఖాజా మొహిద్దీన్ అందజేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్.. చెత్త లెక్క..

- డంపింగ్ బాక్స్‌ల తొలగింపు
- జీరో గార్బేజ్ చూపించుకోవడం కోసం పాట్లు
- నగరంలో పేరుకుపోయిన చెత్త
- వెదజల్లుతున్న దుర్గంధం



కొబాల్ట్‌పేట 7వ లైన్.. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ రోడ్డులో పేరుకుపోయిన చెత్త

లక్ష్మీపురం: అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు పారిశుద్ధ్యంపై శ్రద్ధ అంటూ చెత్తమయం చేస్తున్నారు. స్వచ్ఛా సర్వేక్షణ్ సర్వే నేపథ్యంలో చెత్త చిక్కులు వచ్చిపడ్డాయి. దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది.

వివరాలు... గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని నగరంలో అమలవుతున్న పారిశుద్ధ్యాన్ని పరిశీలించి నివేదికను కేంద్రానికి ఇచ్చేందుకు ఈనెల 19న స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం వచ్చింది. ఈ బృందం వస్తున్నారనే నేపథ్యంలో నగర కమిషనర్ డంపింగ్ బాక్స్‌లను వారం ముందున 56 వార్డులలో దాదాపు 150 బాక్స్‌లను తొలిగించి రేకుల షెడ్‌లో పెట్టడం జరిగింది. అయితే నగరంలోని అన్ని ప్రాంతాలలో నిత్యం పేరుకుపోయిన చెత్త కుప్పలతో స్థానికంగా నివాసం ఉండే భరించలేని దుర్వాసనతో ముక్కులు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

జీరో గార్బేజ్ కోసం పాట్లు..

జీరో గార్బేజ్ ఆధారంగా నగరానికి స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం మార్కులు కేటాయించనున్నారు. దీని కారణంగా నగరంలో ఎలాంటి డంపింగ్ ప్రాంతాలు లేవని చూపించడం కోసం డంపింగ్ బాక్స్‌లను తొలిగించారు. దీంతో ఆ ప్రాంతంలో అదనంగా వచ్చే చెత్తను గతంలో బాక్స్‌లు ఉన్న ప్రాంతంలో డంప్ చేశారు. బృందం వస్తున్న సమాచారం వచ్చే వారం రోజుల ముందు నుంచే డంపింగ్ బాక్స్‌లను తొలిగించడంతో స్థానికంగా రోజు వారి పారిశుద్ధ్య కార్మికులకు పని ఒత్తిడి పెరిగి పోయి ఇబ్బందులు పడుతున్నారు.



రోడ్డు వెంబడి ప్రజలు వేసిన చెత్తను ట్రక్కులోకి ఎత్తుతున్న పారిశుద్ధ్య కార్మికులు

పారిశుద్ధ్య కార్మికులకు పని భారం..

ప్రతి రోజు పారిశుద్ధ్య కార్మికులు చెత్తను సేకరించి ఆ డంపింగ్ బాక్స్‌లో వేస్తే ఆ రోజు సాయంత్రంలోగా చెత్త తీసుకు వెళ్లే వాహనం వచ్చి డంపింగ్ బాక్స్‌లలో ఉండే చెత్తను తీసుకెళ్లే వారు. కాని గత కొన్ని రోజులుగా పారిశుద్ధ్య కార్మికులను కొన్ని డివిజన్‌లలో తగ్గించడంతో ఉన్న కొద్ది పాటి కార్మికులకు పని ఒత్తిడి పెరిగిందని చెబుతున్నారు. పలు డివిజన్‌లలో చెత్త సేకరించే వారు, కాలువలు తీసే వారు ఇద్దరు ఒక్కరే కావడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా నగరంలో డంపింగ్ బాక్స్‌లు లేని కారణంగా నివాసాలలో సేకరించిన చెత్త అంతా రోడ్డుపై వేయడం, మళ్లీ చెత్త సేకరించి వాహనం వస్తే తిరిగి పారిశుద్ధ్య కార్మికులు పనిగట్టుకుని నిల్వ ఉన్న చెత్తను ట్రక్కులో మోసే పని చేస్తు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

జీరో గార్బేజ్ కోసమే...



నగరపాలక సంస్థ స్వచ్ఛా సర్వేక్షన్ బృందానికి జీరో గార్బేజ్‌ని చూపించేందుకు డంపింగ్ బాక్స్‌లను తొలిగించారు. పారిశుద్ధ్య కార్మికులను కొన్ని డివిజన్‌లలో తొలిగించడం, అలాగే కొన్ని డివిజన్‌లలో తగ్గించడం చేయడం వలన రోజు వారి చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. ప్రస్తుత కార్మికులకు పని ఒత్తిడి పెరిగింది. నగర వాసులు కూడా చెత్తను వీధి చివర ప్రాంతాలలో వేయాల్సిన దుస్థితి.

– కె.నళినికాంత్, సీపీఎం నగర కార్యదర్శి



భక్తిశ్రద్ధలతో రంజాన్



ముస్లింలు రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. నెల రోజులపాటు ఉపవాస దీక్షలు పాటించారు. నెలవంక దర్శనంతో పండుగను జరుపుకున్నారు. నగరంలోని మసీదులు, ఈద్గాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. నమాజ్ అనంతరం పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు అందజేసుకున్నారు. పట్టణంలో రంజాన్ సందర్భంగా సందడి వాతావరణం కనిపించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు నల్లబ్యాడ్జిలు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు





కళాదర్బార్ ఉగాది పురస్కారాలు ప్రదానం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై సోమవారం సాయంత్రం కళాదర్బార్– ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కారాల సభ నిర్వహించారు. సభకు కళా దర్బార్ నిర్వాహకులు పాత్తూరి రంగారావు అధ్యక్షత వహించారు. ఆలయ కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ఊటుకూరు నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా అనురాధ అయ్యంగారి (టీవీ రంగం), డాక్టర్ జి.నాగార్జున(వైద్య రంగం), కనుమూరి రాజ్యాలక్ష్మి(విద్యా రంగం), శనివారపు శిరీష(సంగీత రంగం), చెన్నుపాటి శివనాగేశ్వరరావు(వ్యాపార రంగం), సాయి లక్కరాజు(కళా రంగం)లకు ఉగాది పురస్కారాలను అందించి సత్కరించారు. అనంతరం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించగా, గాయని గాయకులు హేమమాలిని, సౌజన్య, బాబురావు, సుధీర్‌బాబు, అబ్దుల్‌ఖాదర్ సినీగీతాలను ఆలపించారు.

స్వామివారి కల్యాణ మహోత్సవానికి తరలిరండి



మంగళగిరి టౌన్ : ఒంటిమిట్ట కోదండరామాలయంలో సీతారాముల వారి కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పద్మశాలీయులు తరలి రావాలని గుంటూరు జిల్లా స్వర్ణకార సంఘం, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని స్వర్ణకార సంఘ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మహేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ సేవా సమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 10న గరుడ సేవలో భాగంగా శ్రీ సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలీయులు తరలివచ్చి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ నాయకులు జానకి రామయ్య, ఉడతా శ్రీనివాసరావు, తిరువీధుల కిరణ్ పాల్గొన్నారు.

కొండపై మంటలు

మంగళగిరి: నగరంలోని గండాలయ స్వామి కొండపై కొందరు ఆకతాయిలు సోమవారం మధ్యాహ్నం నిప్పు పెట్టారు. దీంతో కొండకు మంటలు పాకాయి. నగరంలో మరింత వేడి పెరిగే అవకాశముందని ప్రజలు భయపడుతున్నారు.



మెడికల్ కళాశాల వద్ద గుర్తు తెలియని మృతదేహం



లక్ష్మీపురం: స్థానిక కన్నవారితోట మెడికల్ కళాశాల వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. కన్నవారితోట 5వ లైన్‌లోని మహేశ్వరరావు అనే వ్యక్తి ఇంటి ముందు ఓ వ్యక్తి పడి పోయి ఉండటాన్ని గమనించాడు. మహేశ్వరరావు తక్షణమే మంచినీళ్లను చల్లగా ఆ వ్యక్తి ఎంతకు లేవడం లేదు. దీంతో అనుమానం వచ్చి నగరంపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతుడు సుమారు 55 సంవత్సరాలు ఉన్నట్లు గుర్తించారు. చుట్టు పక్కల విచారించగా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దీంతో మహేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృత దేహాన్ని ప్రభుత్వ సమగాసుపత్రికి తరలించారు. వివరాలకు నగరంపాలెం పోలీస్ స్టేషన్ 0863–2234047, 8688831612,8688831336 నంబర్లను సంప్రదించాల్సిందిగా పోలీసులు కోరారు.

ఎముకలు, కీళ్ల సమస్యలపై అవగాహన అవసరం

ఆరోగ్య సభలో డాక్టర్ రాజశేఖర్ రెడ్డి



ఆరోగ్యసూత్రాలను వివరిస్తున్న డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: ఎముకలు, కీళ్ల సమస్యలపై ఎప్పటికప్పుడు నిరంతరం అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కొత్తూరు రాజశేఖర్ రెడ్డి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో 'ఎముకలు, కీళ్లకు సంబంధించిన సమస్యల'పై ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ మానవుని శరీర నిర్మాణం ఒక ఆకారంగా ఉండటంలో ప్రముఖ పాత్ర వహించే ఎముకలు ఆరోగ్యకరంగా ఉంచుకోవాలని సూచించారు. ఎముకలు ఆరోగ్యంగా ఉండాలంటే మనం తీసుకునే ఆహారంలో క్యాల్షియం ఉండేలా చూసుకోవాలని, మన ఆహారం ద్వారా తీసుకున్న కాల్షియం మన శరీరానికి పట్టడానికి విటమిన్-డి 3 కూడా చాలా ముఖ్యమని పేర్కొన్నారు. సాధారణంగా ఏదో సమస్య వచ్చినప్పుడు కాల్షియం ఉన్న ఆహారం తీసుకోవాలని ప్రయత్నం చేయటం కంటే చిన్న వయసు నుంచే ఎముకలు గట్టిగా ఉండే విషయంలో దోహదపడే క్యాల్షియం ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకుంటే మంచిదని కోరారు. సాధారణంగా మనం ఉష్ణోగ్రత బాగా ఉన్న ప్రదేశంలో జీవిస్తున్నామని, డీ–3 విటమిన్ తీసుకోవాల్సిన అవసరం ఉండదని అపోహలో ఉంటామని అన్నారు. కానీ పరీక్షలు చేయించుకుని డీ–3 లోపం గనుక ఉంటే మందుల రూపంలో తీసుకోవడం మంచిదని సూచించారు. రెండు మోకాళ్లకు ఏకకాలంలో ఆపరేషన్ చేయించుకోవచ్చా అనే అపోహ చాలామందిలో ఉంటుందని, వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని బట్టి అధునాతన సౌకర్యంతో కూడిన థియేటర్ ఉన్న హాస్పిటల్స్‌లో ఏకకాలంలో రెండు మోకాళ్లకు ఒకే సమయంలో శస్త్ర చికిత్స చేయించుకోవచ్చని సూచించారు. మెడ భాగంలో ఉన్న డిస్కులలో సమస్య వచ్చిన ఎడల స్పాండిలైటిస్‌కు దారితీస్తుందని, వెన్నుపూస భాగంలో డిస్క్ లలో సమస్య వచ్చిన ఎడల సయాటికా సమస్యకు దారితీస్తుందని వివరించారు. ఎముకలకు సంబంధించిన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు రోజూ వ్యాయామం చేస్తూ కాల్షియం బాగా లభించే పాల ఉత్పత్తులు, నువ్వులు, పాలకూర లాంటి వాటిని ఆహారంలో ఉండే విధంగా చూసుకుంటూ డీ–3 విటమిన్ లభించే విధంగా కొంత సమయం అయినా ఎండ తగిలే విధంగా నడక అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ కొత్తూరు రాజశేఖర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. సభలో టీవీ సాయిరాం కో–ఆర్డినేటర్ వ్యవహరించగా అవగాహన సీనియర్ సభ్యులు సేతు రామేశ్వరరావు, విశ్రాంత అధ్యాపకుడు ఆర్.రామచంద్ర రావు పాల్గొని ప్రసంగించారు.

స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు



వేడుకలను ప్రారంభిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు రూరల్: స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల సిల్వర్‌జూబ్లీ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. నగర శివారుల్లోని పొత్తూరులోని వైద్యశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి వైద్యశాల ఫౌండర్ డాక్టర్ కె.శివరామ గోపాలన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, ప్రత్తిపాడు శాసనసభ్యులు రామాంజనేయులు, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు నసీర్ అహ్మద్, వల్లూరు జయప్రకాశ్ నారాయణ రిబ్బన్ కట్‌చేసి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో వెస్ట్ ఎమ్మెల్యే గళ్లా మాధవి, డాక్టర్ కేఎస్ ఆర్ గోపాలన్‌స్నిగ్ధా, డాక్టర్ గోపాలన్, డాక్టర్ ప్రేమానంద్, డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ సాయి సుధాకర్, మన్నవ రాధాకృష్ణమూర్తి, హిమసాగర చంద్రమూర్తి, కేఎస్ఆర్ కుటుంబరావు, సుదర్శన్, స్నిగ్ధ ఆయుర్వేద ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ కె.చైతన్య, బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరు తిరుపతి, జనసేన నాయకులు కొరప్రాటి నాగేశ్వర రావు పాల్గొన్నారు.

క్రీడా సాధనతో ఉజ్వల భవిష్యత్



ఉగాది క్రీడా పురస్కారాలు అందుకున్న వారితో నిర్వాహకులు

ప్రముఖ శాస్త్రవేత్త చందు సాంబశివరావు

గుంటూరు వెస్ట్: క్రీడా సాధనతో చిన్నారుల్లో మానసిక స్థితి మెరుగుపడి ఆలోచన విధానంలో పోటీతత్వమేర్పడుతుందని నాసా మాజీ సైంటిస్ట్ చందు సాంబశివరావు తెలిపారు. ఉగాదిని పురస్కరించుకుని గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ స్పోర్ట్స్ మ్యాగజైన్ సంయుక్తంగా జేకేసీ రోడ్డులోని వీవీపీ హెల్త్ క్లబ్‌లో క్రీడల్లో ప్రతిభ, సేవ, శిక్షణ తదితర విభాగాల్లో ఉత్తమ సేవలందించిన వారిని ఘనంగా సత్కరించారు. సాంబశివరావు మాట్లాడుతూ మన రాష్ట్రంలో క్రీడా ప్రోత్సాహం ప్రభుత్వం తరపున చాలా తక్కువన్నారు. చిన్నారుల్లో చక్కని ఆరోగ్యం, క్రీడా స్ఫూర్తిని చిన్ననాటి నుంచే నింపాలన్నారు. ఇది ఒక సామాజిక బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు కూడా చిన్నారులను రోజుకు కనీసం గంట సమయమైనా క్రీడా మైదానాల్లో వదలిపెట్టాలని పేర్కొన్నారు. గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా ఉగాది పురస్కారాలతో ప్రోత్సహిస్తున్నామన్నారు. మొత్తం 60 మందికి క్రీడా పురస్కారాలు అందించామని చెప్పారు. క్రీడా రంగం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం చందు సాంబశివరావు, చిగురుపాటి రవీంద్ర బాబు, జి.శేషయ్య, సాయ్ అథ్లెటిక్ కోచ్ సుబ్బారావు, రాష్ట్ర క్యారమ్స్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్, కేఎల్‌యూ స్పోర్ట్స్ డీన్ కె.హరికిషోర్ అవార్డులను అందజేశారు.

మూడో రోజుకు చేరిన ఎడ్ల పందేలు



నాలుగు పళ్ల విభాగంలో విజేతకు బహుమతి అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

తెనాలిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఆలపాటి శివరామకృష్ణయ్య స్మారక జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన మూడో రోజుకు చేరుకుంది. సోమవారం సాయంత్రం ఆరుపళ్ల విభాగం పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల్లో 14 జతల ఎడ్లు పాల్గొనగా రాత్రి 10.15 వరకు పోటీలు కొనసాగాయి. అలాగే గురువారం రాత్రి నాలుగు పళ్ల విభాగం పోటీలు ముగిశాయి. మూడో రోజు ముఖ్య అతిథిగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఎడ్ల బలప్రదర్శనలు రైతాంగానికి ప్రోత్సాహాన్నివ్వడంతో పాటు పశు పోషకులను ప్రోత్సహిస్తాయని మంత్రి వివరించారు. ఇంత వరకు ఇంత భారీ ఎడ్లబల ప్రదర్శనను తాను చూడలేదని చెప్పారు. నాలుగు పళ్ల విభాగం విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. నాలుగు పళ్ల విభాగంలో బాపట్ల జిల్లా జె.పంగలూరుకు చెందిన రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ యూత్ ఎడ్ల జత నిర్ణీత సమయంలో 4260.03 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ జత ప్రతినిధులకు మంత్రి బహుమతులను అందజేశారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ అధికార ప్రతినిధి వర్ల రామయ్య, ఎస్. అబద్దయ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పోటీల కన్వీనర్ నక్కా ఆనందబాబు పర్యవేక్షించారు.

పాల పోటీలు ప్రారంభం..

ఆవు పాల పోటీలను ప్రారంభమయ్యాయి. పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌నందం అబద్దయ్య పోటీలను ప్రారంభించారు. మంగళవారం ఉదయం, సాయంత్రం పాలు పితికి విజేతలను ప్రకటిస్తారు. పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగిరెడ్డి, విశ్రాంత వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ ఆలపాటి వెంకట్రామయ్య పర్యవేక్షిస్తున్నారు.